



జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజా జ్యోతి

ప్రతిఅక్షరం - ప్రజల కోసం

ఖమ్మం

శుక్రవారం 18 అక్టోబర్ 2024



# పత్తి రైతులు దిగాలు

ఈ ఏడాది ఆశించిన దిగుబడి రాక కుదేలు

వెంటాడుతున్న ప్రకృతి వైపరీత్యాలు

కొరవడిన సర్కార్ సాయం

కానరాని సీసీఐ కొనుగోలు కేంద్రాలు

పంటను 'ప్రైవేట్'కు తెగనమ్ముకుంటున్న రైతులు

ఖమ్మం,

ఆరుగాలం కష్టించి, ప్రకృతి వైపరీత్యాలను ఎదిరించి తీరా పంట చేతికొచ్చేసరికి పత్తి రైతు చతికిలపడడం సర్వసాధారణమైంది. గతేడాది అనావృష్టి కారణంగా పెద్దగా సాగు చేపట్టని ఖమ్మం జిల్లా రైతులు ఈ ఏడాది కోటి ఆశలతో పత్తిని అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. అయితే తాము ఒకటి తలిస్తే.. దైవం మరొకటి తలిచింది అన్నట్లు తయారైంది పరిస్థితి. ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు ప్రభుత్వం నుంచి సాయం అందకపోవడంతో అన్నదాతలను కష్టాలు వెంటాడుతున్నాయి. పత్తి సాగుకు ఖమ్మం జిల్లా పెట్టింది పేరు.. సారవంతమైన భూములు, అనుభవం కలిగిన రైతులు ఉన్నప్పటికీ కొన్నేండ్లుగా ఆశించిన ఫలితాలు పొందలేకపోతున్నారు. జిల్లాలో ఏటా దాదాపు 2 లక్షల ఎకరాలకు పైబడి పత్తి సాగు చేస్తున్న రైతులు ఈ ఏడాది సైతం ఒకవైపు దిగుబడి లేక.. మరోవైపు గిట్టుబాటు ధర రాక దిగాలు చెందుతున్నారు. గడిచిన ఏడాదికాలంగా ఖమ్మం జిల్లా రైతులను ప్రకృతి వైపరీత్యాలు పగబట్టినట్లు వెంటాడుతున్నాయి. దీంతో అన్నదాతలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోయిన యాసంగిలో సాగర్ కాల్వ నీటి విడుదల జరగకపోవడంతో జిల్లావ్యాప్తంగా యాసంగి సాగుకు బ్రేక్ పడింది. కనీసం పదిశాతం సాగు జరగలేదు. అయితే ఈ వానకాలంలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ - మిగతా6లో



# భక్త శబరి స్మరణలో

అపర భక్తురాలికి ఫల, పుష్పాలతో ప్రత్యేక పూజలు

అశ్వారావుపేట మండలం వినాయకపురంలో స్మృతియాత్ర

భద్రాద్రి రామాలయ మాడవీధుల్లో ఉత్సవమూర్తుల ఊరేగింపు

భద్రాచలం

భద్రగిరి క్షేత్రంలో రామయ్యకు అపర భక్తురాలైన శబరి స్మృతియాత్రను గిరిజనుల సమక్షంలో గురువారం వైభవోపేతంగా నిర్వహించారు. భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఏటా ఆశ్వయుజ పౌర్ణమి రోజు శబరి స్మృతియాత్ర నిర్వహించడం ఆనవాయితీ. అయితే ఈ ఏడాది గిరిజన గ్రామమైన అశ్వారావుపేట మండలం వినాయకపురంలో ఉత్సవం - మిగతా4లో

# బాలికల మరుగుదొడ్లు ప్రారంభం







పాలేరు అక్టోబర్ 17 ప్రజాజ్యోతి: నెస్లే ఇండియా కార్పొరేట్ సామాజిక బాధ్యతలో(సీఎస్ఆర్) భాగంగా కూసుమంచి ఉన్నత పాఠశాలలో బాలికలకోసం నిర్మించిన ఐదు రెడిమెడ్ మరుగుదొడ్లను గురువారం మాజీ ఎంపీటీసీ మాదాసు ఉపేందర్, మాజీ సర్పంచ్ చెన్న మోహన్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కూసు మంచి మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయల వీరస్వామి మాట్లాడుతూ నెస్లే ఇండియా వారు సామాజిక బాధ్యతగా మరుగుదొడ్లు నిర్మించడం అభినందనీయమన్నారు. మున్ముందు మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. పాఠశాల అభివృద్ధికి చేయూత నిచ్చేవారికి విద్యాశాఖ తరపున సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నెస్లే ఇండియా కార్పొరేట్ అఫైర్స్ మేనేజర్ వాసిం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధిలో రాజకీయాలు, కులాల ప్రస్తావన మంచిది కాదు.



## విలేకరుల సమావేశంలో మండేపూడి

కారేపల్లి , అక్టోబర్ 17,ప్రజాజ్యోతి: సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లి లో గల పెద్దమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణంలో మీ పాత్ర ఏమిటి అని, ఏ అర్హత లేని వ్యక్తులు నేడు రోడ్డు మీదకు వచ్చి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని పెద్దమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణ ధర్మకర్త మండేపూడి శ్రీనివాసరావు అన్నారు. గురువారం కారేపల్లిలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మండేపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ కారేపల్లి లోని శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయాన్ని నిర్మించింది ఎవరు, ఆలయం నిర్మించి 2017 నుండి 6 సంవత్సరాలు నేను చైర్మన్ గా ఎర్ర నరసింహారావు కార్యదర్శిగా, రాజకీయాలకు అతీతంగా కులలవారిగా11 మంది సభ్యులం కమిటిగా భక్తుల, కమిటీ సహకారంతో గుడిని అభివృద్ధి చేశాము. ఇందులో ఇప్పుడు, గుడి నిర్మాణంలో గానీ, ఫంక్షన్ హాల్ నిర్మాణంలో గానీ, నైవేద్య శాల నిర్మాణంలో గానీ, గుడిలో సమస్త వస్తువులు సమకూర్చడంలో నీ పాత్ర ఏమిటి, అసలు గుడి నిర్మాణం జరిగే టప్పుడు నీ పరిస్థితి ఏమిటో ఈ గ్రామ ప్రజలకు తెలియదా అన్నారు. 2016 లో డబ్బులు లేక నిర్మాణం ఆగిపోతే ఒక వ్యక్తి వద్ద వడ్డీకి తెచ్చి గుడి నిర్మాణం పూర్తి చేశాను, అప్పుడు ఎక్కడికి పోయారు మీరు, గుడి నిర్మాణం పూర్తి అయిన తర్వాత ప్రతిష్ఠ కొరకు గ్రామం లోని అన్ని కులాల పెద్దలని పిలిచి 2017 జూన్ లో ప్రతిష్టకు బాగుంది అని చెప్పాక గ్రామంలోని ప్రజలందరూ ప్రతిష్ట కొరకు వస్తు, ధన రూపేణా సహకరించగా, ప్రతిష్టను దిగ్విజయంగా ప్రస్తుత మంత్రి వర్యులు, అప్పటి పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అప్పటి వైరా శాసనసభ్యులు మదన్లాల్ సమక్షంలో పూర్తి చేసుకోవటం జరిగింది. ప్రతిష్ఠ పూర్తి అయిన 16 రోజుల పండుగనాడు ప్రతిష్టకు సహకరించిన భక్తులందరికీ అప్పటి సిఐ చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేయటం జరిగింది. అప్పటికి ఇవ్వాల్సిన వారికి అందరికీ ఇవ్వగా ఇంకా రూ 15.50 లక్షల రూపాయలు బాకి ఉండగా వద్దిరాజు రవిచంద్ర 3లక్షలు, తాతా శ్రీనివాసరావు 1లక్ష, గ్రామ పంచాయతీ కార్మికులు 10వేలు మొత్తం 4లక్షల 10వేలు రాగా, బాకీ పడ్డ 15.50 లక్షల రూపాయలలో 4.10లక్షలు పోగా 11లక్షల బాకీ ఉండగా సదరు బాకీ మొత్తం సొంత స్థలం అమ్మి కట్టాను. ఇప్పుడు మాట్లాడేవారు ఆరోజు ఎందుకు మాట్లాడలేదు, గుడి కట్టి ఎండోమెంట్ లో 43 రిజిస్ట్రేషన్ చేసింది నేను కాదా, గుడి నిర్మించి మొత్తం అభివృద్ధి చేశాక ఇపుడు వచ్చి ఆలయంలో రాజకీయాలు చేస్తోంది ఎవరు అన్నారు. గుడి ప్రతిష్ఠ సమయంలో గోడకు నిర్మాణ కర్త మండెపుడి రాణిశ్రీనివాస్ అని పెట్టిన శిలాపలకాన్ని ఆలయానికి ఎస్సై, సీఐ, తహసిల్దార్, ఇతరులు వచ్చినప్పుడు కనబడకుండా స్టిక్కర్లు వేసిన విషయం నిజం కాదా అన్నారు. స్టిక్కర్లను చించి వేయడంతో శిలాఫలకం కనపడకుండా అమ్మవారి ఫోటో అడ్డుగా ఎందుకు పెట్టారు. మాట్లాడితే తురక నారాయణ అనే వ్యక్తి నాది భూమి అంటున్నారు, అదే నిజమైతే అయితే 2016 లో అప్పటి తహసిల్దార్ స్థానిక విఆర్ఓ తో విచారణ జరిపి అది గుడి స్థలం అని లిఖితపూర్వకంగా ఇచ్చారన్నారు. నేను గుడి నిర్మాణం చేసింది గ్రామం కొరకు నా ఇంటి కొరకు కాదు, గ్రామంలోని అన్ని కులాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకోవచ్చు. అసలు నువ్వు ఏమి తెచ్చావని నన్ను అడుగుతున్నావు నీకు భక్తి అనేది ఉంటే శ్రీరామ నవమి సందర్భంగా 60 వేలు ఖర్చు చేసి పండరి అనే భక్తుడు పంచలోహ విగ్రహాలు తెస్తే ఎందుకు తీసుకోలేదు. అవి బిక్యతండలో ఎందుకు ఇవ్వాల్సి వచ్చిందో గ్రామ ప్రజలందరికీ తెలపాలి. ఏదైనా దేవుడి మీద భక్తితో గుడి అభివృద్ధికి కృషిచేయాలి తప్ప కులం పేరుతో తిట్టడం, వస్తువులు తీసుకొని పోయారు అని ప్రచారం చేయటం సరైన పద్ధతి కాదు. సింగరేణి గ్రామంలో వెంకటేశ్వర స్వామి ఆలయం, పెద్దమ్మ తల్లి ఆలయం నిర్మించడంతోపాటు నా భార్య మండేపూడి రాణి సర్పంచ్ గా పనిచేసిన సందర్భంలో ఆమరణ నిరాహార దీక్షకు సైతం వెనకాడకుండా సింగరేణి నిధుల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేశాను. ఆలయం వేదికగా రాజకీయాలు చేయడం సరైంది కాదని, ఈ పద్ధతి మానుకుంటే మంచిదని హితవు పలికారు. కొంతమంది వ్యక్తులు కావాలని దౌర్జన్యంగా ఆలయంలో ప్రవేశించి రాజకీయాలకు వేదికగా చేస్తున్నారని ఆరోపించారు. చట్ట ప్రకారం ముందుకు వెళ్లడానికి నేను సిద్ధమని ఆయన పేర్కొన్నారు.

# బెటాలియన్ లో ఘనంగా వాల్మీకి జయంతి వేడుక




సత్తుపల్లి అక్టోబర్17 ప్రజా జ్యోతి : మండల పరిధిలోని గంగారం గ్రామంలో గల 15వ పటాలము నందు వాల్మీకి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బెటాలియన్ కమాండెంట్ పి.జె.పి.సి చటర్జీ వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి,నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ వాల్మీకి ఆదికవిగా, ప్రపంచ ప్రసిద్ధి గాంచిన మహాకవిగా, రామాయణ,మహా కావ్యాన్ని రచించిన వాల్మీకి మహర్షి, ఇలాంటి గొప్ప వ్యక్తులను స్మరించుకోవడం, భావి భారత ప్రజలకు మరియు భవిష్యత్ తరాల వారికి,వాల్మీకి యొక్క గొప్పదనాన్ని వివరించడం కోసం జయంతి ఉత్సవాని జరుపుకోవటం అదృష్టం అన్నారు.ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ కమాండెంట్ యస్. డి రంగారెడ్డి, ఆఫీసర్స్ మరియు కానిస్టేబుల్,ఆఫీసర్స్ మరియు మినిస్టీరియల్ స్టాఫ్, మెడికల్, ఔట్సోర్సింగ్ సిబ్బంది, హెూం గార్డ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఈటెలను కలిసిన తురక నారాయణ




కారేపల్లి , అక్టోబర్ 17, ప్రజా జ్యోతి:కారేపల్లి రైల్వే జంక్షన్ అభివృద్ధి బోర్డు మెంబర్ తురక నారాయణ గురువారం మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ను కలిశారు. ఖమ్మం పర్యటనకు విచ్చేసిన ఈటల రాజేందర్ ను కలిసి కారేపల్లి రైల్వే స్టేషన్ లో ఉన్న పలు సమస్యలను వివరించారు. ప్రధానంగా కరోనా సమయంలో కారేపల్లి మీదుగా నడిచే రైళ్లన్నీ రద్దయిన విషయాన్ని వివరించి సదరు రైళ్ల ఆవశ్యకతను తెలిపి వాటిని యధావిధిగా నడపాలని కోరారు. దీంతోపాటుగా మండలంలోని అనేక సమస్యలను ఈటల రాజేందర్ దృష్టికి తీసుకొని వెళ్లినట్లు తురక నారాయణ పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశానని తెలిపారు.

# వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే...మట్టా.



సత్తుపల్లి అక్టోబర్17 ప్రజా జ్యోతి. : మండల పరిధిలోని కాకర్లపల్లి గ్రామంలో గల కంచర్ల శ్రీనివాస్,ద్రౌపతి కుమారుడు కేశవ స్వప్న రిసెప్షన్ వేడుకలు వారి స్వగృహం నందు జరగగా, గురువారం సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టారాగమయి దయానంద్ హాజరై వధూవరులను ఆశీర్వదించి, అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో పువాళ్ళ ఉమ, కొప్పుల రమేష్,బేతిని శ్రీనివాస్, మాజీ ఎంపీపీ చల్లారి వెంకటేశ్వరరావు, కమల్ భాష తదితరులున్నారు.

# రేలకాయలపల్లి ఆశ్రమ పాఠశాలలో ఘనంగా కొమరం భీమ్ వర్ధంతి.



కారేపల్లి, అక్టోబర్ 17 ప్రజా జ్యోతి: సింగరేణి మండలం రేలకాయలపల్లి ఆశ్రమ పాఠశాల యందు గురువారం మన్యం వీరుడు కొమరం భీమ్ 84 వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు లాకావత్ రాములు కొమరం భీమ్ వేషధారణలో ఉన్న విద్యార్థికి పూలమాల వేశారు . అనంతరం ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కొమరం భీమ్ ఆశయాలను, త్యాగాలను , పోరాటాలను విద్యార్థులకు వివరిస్తూ, అతని జీవిత చరిత్రను ఆదర్శప్రాయంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, హెచ్ ఎస్ పాఠశాల సిబ్బంది ఎన్. శ్రీనివాసరావు, బి. బిచ్చు, బి. వెంకటేష్ , జీ. సక్రాం, డి. వెంకటేశ్వర్లు, బి. వెంకటేశ్వర్లు, మోకాళ్ళ రాంబాబు , సిహెచ్. వెంకటేశ్వర్లు , జి. వీరన్న, డి.తార తదితరులు పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాలు చేయడంలోనే ఆత్మ సంతృప్తి..



## దుప్పట్లు పంపిణీ చేసిన బాలకృష్ణ..

తల్లాడ, అక్టోబర్ 17 (ప్రజా జ్యోతి న్యూస్): సమాజంలో వెనుకబడిన నిరుపేదలను ఆదుకోవడమే లక్ష్యంగా తమ సంస్థ పనిచేస్తుందని బహుజన సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మోదుగు బాలకృష్ణ అన్నారు. గురువారం తల్లాడ మండలంలోని బిల్లుపాడు గ్రామంలో నిరుపేదలకు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ తల్లాడ మండలంలో వెనుకబడిన పేదలకు గుర్తించి వీటిని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటు ఎవరికైనా ఆరోగ్య పరంగా అవసరమైన వారికి మందులు పంపిణీ చేయడంతో పాటు పేదలు ఉంటే ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వైరా మార్కెట్ కమిటీ పగడాల లచ్చిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సామినేని రామ అప్పారావు, బోనాసి శ్రీను, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోండి





## పంట పొలాలను పరిశీలించిన వ్యవసాయ శాఖ అధికారులు

## కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సరిత

పాలేరు అక్టోబర్ 17 ప్రజా జ్యోతి : కూసుమంచి మండలంలోని చౌటపల్లి గ్రామంలో వరి, పత్తి మిర్చి తోటలను పంట నమోదు వెరిఫికేషన్ లో భాగంగా కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సరిత సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ రైతులందరూ ప్రత్తిలో గులాబీ రంగు పురుగును గమనించినట్లయితే సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా ప్రస్తుతం వరిలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు సూడిదోమ ఉధృతంగా ఉన్నాయని వీటి నివారణకు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అంతేకాకుండా అక్కడక్కడ వరి కోతలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులందరూ మండలంలో అందుబాటులో ఉన్న 12 ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాలేరు క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి మానస మరియు రైతులు పాల్గొన్నారు.

# పి.డి.ఎస్ యు. అర్ధ శతాబ్ది ఓత్సవ పోస్టర్ ఆవిష్కరణ.



పాలేరు అక్టోబర్ 17 ప్రజా జ్యోతి : ఈనెల 21న ఖమ్మం ఈనెల 24న హైదరాబాదులో జరిగే పి డి ఎస్ యు అర్ధ శతాబ్ది ఉత్సవ సభలను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం ప్రగశీల మహిళా సంఘం పి ఓ డబ్ల్యు ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు పరకాల లక్ష్మక్క పాలేరు కూసుమంచిలో పిడిఎస్ యు పోస్టర్ రిలీజ్ చేసి అనంతరం వారు మాట్లాడుతూ దిశ నిర్భయ ఫోక్సో ఎన్ని చట్టాలు తీసుకొచ్చిన మహిళలపై అనేక దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం బిల్కిస్ భాను లాంటి వారిని రేప్ కేసులో ఉన్న ముద్దాయిలను బయటికి తీసుకువచ్చి సన్మానించడం అత్యంత దుర్మార్గమైన చర్య అని అన్నారు. మణిపూర్ లో మహిళలను వ్యవస్థలను చేసి వారిని చెప్పరాని విధంగా హింసించి రేప్ చేసి చంపిన వారిని శిక్షించలేదన్నారు. 75 సంవత్సరాల స్వతంత్ర భారతంలో స్త్రీలకు రక్షణ లేదన్నారు అందుకనే పిడిఎస్ యు పూర్వ విద్యార్థులు ప్రస్తుత విద్యార్థులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే మతోన్మాదం నూతన విద్యా విధానం ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా యువత పెద్ద ఎత్తున పోరాడాలని అదేవిధంగా పిడిఎస్ యు అర్థ శతాబ్ది ఉత్సవం ఈనెల 21న ఖమ్మంలో ఈనెల 24న హైదరాబాదులో జరిగే సభలను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం కూసుమంచి మండల అధ్యక్ష కార్యదర్శులు చెరుకుపల్లి రేవతి, బజ్జూరి కళావతి, సత్యవతి నీలమ్మ, మంగతాయి, విజయ, సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

# మొదటి విడత ఉండి లెక్కింపు.



కారేపల్లి, అక్టోబర్ 17, ప్రజా జ్యోతి: సింగరేణి మండల పరిధిలోని ఉసిరికాయ పల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కోట మైసమ్మ అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో దసరా పండగ సందర్భంగా జరిగిన జాతర లో భాగంగా అమ్మవారికి వచ్చిన నగదు మొదటి విడత గా హుండీ లెక్కింపు గురువారం నాడు జరిగింది. హుండీ ఆదాయం ఏడు లక్షల మూడు వేల ఆరూ రూపాయలు వచ్చినాయి.గత సంవత్సరం కంటే ఏడు వేల రూపాయలు అధికంగా వచ్చినాయి.ఈ జాతర ఈనెల 21 తారీకు వరకు జరుగుతున్నందున మిగిలిన ఆదాయ వివరములు 21 వ తారీఖు నాడు తెలియజేయగలమని ఆలయ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం దేవాదాయ ఇన్స్పెక్టర్ ఎం. అనిల్ కుమార్,ఆలయ ఈవో కే. వేణుగోపాలచార్యులు, ఆలయ ఫౌండర్ చైర్మన్ పర్సా పట్టాభి రామారావు, ఆలయ సిబ్బంది పగడాల మోహన్ కృష్ణ,పర్స సాయి, తదితరులు పాల్గొన్నారు.

# అన్నారుగూడెంలో ఘనంగా అయ్యప్పల ఇరుముడి..



## హాజరైన మట్టా దయానంద్..

తల్లాడ, అక్టోబర్ 17 (ప్రజా జ్యోతి న్యూస్): తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో గురువారం అయ్యప్ప స్వాములు పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ హాజరై అయ్యప్ప స్వాములకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దగ్గుల రఘుపతి రెడ్డి, అన్నారుగూడెం సొసైటీ డైరెక్టర్ గోవిందు శ్రీనివాసరావు, వడ్డే రామారావు, కొమ్మినేని వెంకటేశ్వరరావు కె.వి, తుమ్మలపల్లి రమేష్ మాజీ ఎంపీటీసీ తాళ్ల జోసెఫ్, పొన్నం కృష్ణయ్య, గోవిందు సురేష్, పిన్ని హరీష్, ఇండ్ల రంగా, సుంకర నాగేశ్వరావు, సూదా నరసింహ రావు, తోట వెంకటేశ్వర్లు, రాగం వేలాద్రి, రమణ,తదితరులు పాల్గొన్నారు.

# లావసాటి వరిసాగుపై రైతులకు అవగాహన



కల్లూరు అక్టోబర్ 17 ప్రజా జ్యోతి: మండల పరిధిలోని చెన్నూరు గ్రామ రైతులకు లాభసాటి వరి సాగుపై వెదజల్లే పద్ధతిని అవగాహన కల్పించారు. గురువారం చెన్నూరు రైతులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఎస్ఆర్ ఫండ్ సహకారంతో భారతీయ వరి పరిశోదన సంస్థ ఆధ్వర్యం నేరుగా విత్తే పద్ధతి లో వరి సాగు చేసే రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య భారతీయ వరి పరిశోదన సంస్థ కీటక విభాగ టెక్నికల్ ఆఫీసర్ టి.వెంకయ్య,సేవా స్పూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్,జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య మండల వ్యసాయాధికారి రూప మాట్లడుతూ ప్రస్తుత పరిస్థితులలో వాతావరణ మార్పులు,అకాల వర్షాలు ,తరిగిపోతున్న భూగర్భ నీటి వనరులు,వర్షాభావ పరిస్థితులు,విద్యుత్ సమస్య, కూలీల కొరత,వ్యవసాయ ఉత్పాదకాల ధరలు బాగా పెరుగుట వల్లన వరి వ్యవసాయము గిట్టుబాటుకాక, వ్యవసాయ ఖర్చును తగ్గించుటకు రైతులకు నేరుగా విత్తే వరిసాగు పై అవగాహన కల్పించడం జరిగింది, వరవరిసాగు లాభసాటిగా చేసుకోవటానికి యాంత్రీకరణ చాలా అవసరం.పొలం తయారీ, విత్తడం,ఎరువులు వేయడం, కలుపు మందులు, క్రిమిసంహారక మందులు పిచికారీ చేయటం, వరికోత,కట్టడం,నూర్పిడి, ఆరబెట్టడం వంటి అన్ని పనులకు యంత్రములు మరియు డ్రోన్స్ అందుబాటులో ఉన్నవి.ఇవి ఉపయోగించి సాగుఖర్చును తగ్గించుకోవచ్చు.నాట్లు వరిసాగు ఖర్చు కంటే నేరుగా విత్తే వరిసాగుకు హెక్టారుకు రూ 8వేల నుంచి 10వేలవరకు ఖర్చు తగ్గుతుందనీ తెలిపారు.అలాగే డ్రోన్ టెక్నాలజీ తో సుమారు 50 ఎకరాల వరి లో ఉల్లికోడు మరియు కాండం తొలుచు పురుగు నియత్రణకు ఉచితం స్ప్రే చేయడం జరిగింది.కార్యక్రమంలో శ్రీను,యంగ్ ప్రొఫెషనల్ కె.అజయ్,డ్రోన్ ఆపరేటర్ సంతోష్ రెడ్డి,దొరవయ్య , హుస్సేన్,నాగరాజు,బాల కృష్ణ, కిరణ్,వెంకట్,అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి జర్నలిస్టుల సొసైటీ ఏర్పాటుకు శ్రీకారం.





## జిల్లాలోనే 2వ సొసైటీ కావడంతో ఆనందంలో జర్నలిస్టులు.

## సొసైటీఅధికారుల పర్యవేక్షణలో జనరల్ బాడీ సమావేశం.

సత్తుపల్లి అక్టోబర్17 ప్రజా జ్యోతి. : జర్నలిస్టుల సంక్షేమం కోసం 23మంది వర్కింగ్ జర్నలిస్టులతో ల ఏర్పాటు చేసుకున్న సత్తుపల్లి జర్నలిస్ట్ మ్యూచువల్ ఎయిడెడ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ సత్తుపల్లి ఆన్లైన్ ప్రక్రియ పూర్తి అవటంతో, గురువారం జిల్లా అసిస్టెంట్ రిజిస్టర్ రవికుమార్, సీనియర్ ఇన్స్పెక్టర్ మౌలానా ఆధ్వర్యంలో సొసైటీ సమావేశాన్ని స్థానిక చెర్రీస్ రెస్టారెంట్లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో సొసైటీ ఏర్పడాలంటే మాన్యువల్ గా ఉండేదని, ప్రస్తుతం ఉన్న రోజుల్లో పూర్తిగా ఆన్లైన్ ప్రక్రియ కావటం తోటి,ప్రతిదీ ఆన్లైన్ చేయాలన్నారు. సత్తుపల్లి జర్నలిస్టులు సొసైటీ ప్రక్రియ పూర్తయిందని, డాక్యుమెంటేషన్ వెరిఫికేషన్ కోసం ఈరోజు మేము వచ్చామని, త్వరలోనే రిజిస్ట్రేషన్ నెంబర్ కూడా వస్తుందని అన్నారు. జిల్లాలోని సత్తుపల్లి 2వ సొసైటీగా విజయవంతంగా పూర్తి అయినందుకు ఆనందం వ్యక్తం చేశారు. సొసైటీ ద్వారా జర్నలిస్టులకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, ప్రభుత్వం తరపున వచ్చే అవకాశాలు, వ్యాపార లావాదేవీలకు సొసైటీ ఎంతగానో ఉపయోగపడుతుందని, ఆయన క్షుణ్ణంగా వివరించి చెప్పారు. ఈ సందర్భంగా జనరల్ బాడీ ఏర్పాటు చేసి, కమిటీ వేసి తీర్మానం చేయించారు. ప్రతి ఒక్కరు విధివిధానాలు తప్పకుండా పాటించాలని, సొంత నిర్ణయాలు ఎట్టి పరిస్థితిలో పనిచేయవని,తుది నిర్ణయం కమిటీ వారిదే తుది నిర్ణయం అన్నారు. అనంతరం టి.యు.డబ్ల్యు. ఐజేయు రాష్ట్ర నాయకుడు ఖాదర్ బాబా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఐజేయు జర్నలిస్టుల సంఘాన్ని గుర్తించి, ప్రెస్ అకాడమీ చైర్మన్ గా శ్రీనివాస్ రెడ్డి ని నియమించారని గుర్తు చేశారు. ఈ సొసైటీ చీఫ్ ప్రమోటర్ గా బి వి రామారావు ఎన్నిక కావటం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు సభ్యత్వం కల్పిస్తూ, సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తాము అన్నారు. ఉపాధ్యక్షుడిగా కలవకొలను సతీష్, కార్యదర్శిగా కందుల గురవయ్య, కోశాధికారిగా రఫీ, డైరెక్టర్లుగా రామకృష్ణ, బత్రా శ్రీనివాస్, నిమ్మగడ్డ శ్రీకాంత్, ఎస్.కె మున్నీర్, మెహరాజ్ ,ఇనపనూరి శ్రీనివాస్ రావు, ఎన్నుకున్నట్లు అధికారులు ధ్రువీకరించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు పూరేటి శ్రీనివాసరావు, కోట అశోక్ రాజా, రమణ, శ్రీనివాస రాథోడ్, మారోజుఅశోక్ కుమార్, కోక్కిరిగడ్డ శ్రీనివాసరావు, క్రాంతి,సుబ్బారావు, ఫజల్, కరుణాకర్, రాంబాబు గౌడ్ తదితరులున్నారు. ఈ వర్కింగ్ జర్నలిస్టు కోఆపరేటివ్ సొసైటీ ఏర్పడినందుకు కమిటీ సభ్యులకు అందరూ అభినందనలు తెలిపారు.

# మిరపలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలి



మండల వ్యవసాయ శాఖ అధికారి రామడుగు. వాణి



కూసుమంచి అక్టోబర్ 17 ప్రజా జ్యోతి: కూసుమంచి మండలంలోని మునిగేపల్లి గ్రామంలో మిర్చి తోటలను మండల వ్యవసాయ అధికారిణి రామడుగు వాణి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిరపలో వేరు కుళ్ళు తెగులు గమనించడం జరిగిందనీ , నివారణకు గాను కాపర్ ఆక్సిక్లోరైడ్ 3గ్రా లేదా కాపర్ హైడ్రాక్సైడ్ 2.5 గ్రా లేదా కార్బెండేజిం 1 గ్రా, లీటర్ నీటికి కలిపి, మొక్క మొదలు భూమి తడిచేలా పిచికారి చేయాలనీ సూచిం చారు. అదేవిధంగా బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు గమనించడం జరిగిందనీ,దీని నివారణకు గాను కాపర్ ఆక్సిక్లోరైడ్ 30 గ్రాం స్టెప్టోసైక్లిన్ 1గ్రా, 10 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. మిరప మొక్కలు పసుపు రంగులోకి మారినట్లు గమనించడం జరిగితే యాజమాన్యంలో భాగంగా మొక్క వయసు బట్టి 13-0-45 లేదా 19-19-19, 5-10 గ్రా, లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారిచేసుకోవాలనీసూచిం చారు. అంతేకాకుండా మిరపలో పై ముడత గమనించడం జరిగిందనీ నివారణకు వేప నూనె 1500 పీపీఎం 5 మి.లి మరియు ఫిప్రోనిల్ 2 మి లి లేదా ఎసిటమీప్రిడ్ 0.2 గ్రా లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలనీ,కింది ముడత నివారణకు స్పైరోమేసిఫేన్ 1 మి.లి లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలనీ సూచించారు. ఈ కార్ర్యమంలో రైతులు రామ రాంబాబు ,కామినేని మాధవరావు ,తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలాయపాలెం లో ఘనంగా సంస్కృత ఆదికవి వాల్మీకి జయంతి

## చిత్రపటానికి పూలదండలు వేసి స్మరించుకున్న ఎంపీడీవో... షేక్. సిలార్ సాహెబ్




తిరుమలాయపాలెం, అక్టోబర్ 17, ప్రజా జ్యోతి : తిరుమలాయపాలెం ఎంపీడీవో కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి ఘనంగా జరిగింది, మహర్షి వాల్మీకి చిత్రపటానికి తిరుమలాయపాలెం ఎంపీడీవో షేక్ సిలార్ సాహెబ్ పూలదండలు వేసి స్మరించుకున్నారు, అదేవిధంగా అన్ని శాఖల అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని పుష్పగుచ్చాలు చిత్రపటంపై ఉంచి స్మరించుకున్నారు, ఈ సందర్భంగా ఎంపీడీవో షేక్ సిలార్ సాహెబ్ మాట్లాడుతూ, సంస్కృత ఆదికవి, రామాయణ మహా కావ్య రచయిత, రామాయణాన్ని మహాకావ్యంగా మలిచి మానవ జాతికి సన్మార్గాన్ని నిర్దేశించిన మహోన్నత మహర్షి వాల్మీకి అని అన్నారు, ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ శారదా దేవి, సీనియర్ అసిస్టెంట్ షేక్ హుస్సేన్, జూనియర్ అసిస్టెంట్ తిగుళ్ల శ్రీనివాస్, టైపిస్ట్ హుస్సేన్, అటెండర్లు, కార్యాలయ సిబ్బంది టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బాషబోయిన వీరన్న, కాంగ్రెస్ మండల నాయకులు వార వెంకటేశ్వర్లు, తవడబోయిన కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం మండల మహాసభలను జయప్రదం చేయండి

**సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరావు పిలుపు**




**తిరుమలాయపాలెం, అక్టోబర్ 17, ప్రజా జ్యోతి :** తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామంలో అక్టోబర్ 27న సిపిఎం మండల మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఈ యొక్క సభలు జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరావు పిలుపునిచ్చారు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ విస్తరణ కోసం ఈ మూడు సంవత్సరాల కాలంలో అనేక ఉద్యమాలు నిర్వహించి ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేసిన పార్టీ సిపిఎం పార్టీఅని దేశం, రాష్ట్రం, జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజలకు అందుబాటులో ఉన్నటువంటి పార్టీ మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆయన అన్నారు అమరవీరుల త్యాగాలతో ఏర్పడ్డ ఎర్రజెండా వారి వారసత్వం తీసుకొని ముందుకు పోవాలని పార్టీని ముందుకు తీసుకెళ్లడంలో కార్యకర్తలు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్, జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్, పార్టీ మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, పద్మనాభుల సుధాకర్, అంగిరేకుల నరసయ్య, బింగి రమేష్, మిగినాటి వెంకట్రావు, తుళ్లూరు నాగేశ్వరరావు, కొలిచలం స్వామి, దాసరి మహేందర్, దిండు మంగపతి, ఇప్పుల పుష్పవతి, బండారి సైదులు, కోట ఉపేందర్ రెడ్డి, పప్పుల ప్రసాద్, రేపాకుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## భక్త శబరి స్మరణలో

-మొదటిపేజీ తరువాయి

నిర్వహించాలని రామాలయ ఈవో రమాదేవి నిర్ణయించడంతో అక్కడ గిరిజన మహిళల కోలాటాలు, కొమ్ము నృత్యాలు, గిరిజన సాంప్రదాయం ప్రకారం శబరి స్మృతియాత్రను కనుల పండువగా నిర్వహించారు. భద్రాద్రి రామాలయానికి గిరిజనులు సంప్రదాయం ప్రకారం పండ్లు, పూలు తీసుకొచ్చి అర్చకుల వేదమంత్రాల నడుమ వాటిని స్వామివారికి సమర్పించారు. అనంతరం చప్టా దిగువనున్న తూము నర్సింహదాసు, భక్తరామదాసు విగ్రహాలకు అర్చకులు ప్రత్యేక పూజలు చేసి హారతులిచ్చారు. శబరి మాత విగ్రహానికి కూడా పూలు, పండ్లు, వస్త్రాలను సమర్పించారు.

అనంతరం బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారి ఉత్సవ విగ్రహాలు, శబరి విగ్రహానికి గిరిజనులు పలు రకాల పూలు, పండ్లు సమర్పించగా.. అర్చకులు స్వామివారి నిత్య కల్యాణం జరిపించారు. అనంతరం గిరిజన పెద్దలను ఆలయ అర్చకులు సత్కరించారు. తొలుత శబరి స్మృతియాత్రలో భాగంగా రామాలయ మాడవీధుల్లో ఉత్సవమూర్తులను ఘనంగా ఊరేగించారు. యాత్రను భక్తులు తిలకించి పరవశించిపోయారు. శబరి స్మృతి యాత్రలో భాగంగా కూనవరం-వీఆర్‌పురం గ్రామాల మధ్య శబరి నదికి అర్చకులు పూజలు చేసి అక్కడే ఉన్న శబరి విగ్రహానికి నదీజలంతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, గిరిజన పెద్దలు పాల్గొన్నారు.

# మత్స్యకారులు చేపల పెంపకంతో ఆదాయం పెంచుకోండి

**మత్స్య శాఖ అధికారి శివ ప్రసాద్**

**చేప పిల్లలు పంపిణీ చేసిన ఎంపీడీవో షేక్ సిలార్ సాహెబ్**


**తిరుమలాయపాలెం, అక్టోబర్ 17, ప్రజా జ్యోతి :** తిరుమలాయపాలెం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మత్స్య శాఖ వారి ఆధ్వర్యంలో పలు గ్రామాలకు ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో తిరుమలాయపాలెం, పిండిప్రోలు, వెదుళ్ళ చెరువు, పాతర్లపాడు, పైనంపల్లి, బచ్చోడు తదితర గ్రామాల మత్స్యకారులు పాల్గొని ప్రభుత్వం ద్వారా పంపిణీ చేయబడుతున్న చేప పిల్లలను వారి వారి చెరువులలో వదలటం కోసం తిరుమలాయపాలెం మండల కేంద్రం ఎంపీడీవో కార్యాలయం నుండి తీసుకువెళ్లడం జరిగింది ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ అధికారి శివప్రసాద్, ఎంపీడీవో షేక్ సిలార్ సాహెబ్, మత్స్య శాఖ ఫీల్డ్ ఆఫీసర్ చాముండేశ్వరి, భాను ప్రకాష్ పాల్గొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినారు మత్స్యకారులు ఈ ఉచిత చేప పిల్లలను తమ తమ చెరువులలో పోసుకొని ప్రభుత్వం ద్వారా ఉపాధిని పొందుతారని మత్స్యకారుల కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం కావాలని ప్రభుత్వ యొక్క సదుద్దేశమని మత్స్యకారులు ఈ పథకం ద్వారా వారి చెరువులలో చేప పిల్లలను పెంచుకోవడం ద్వారా ఉపాధి పొందుతారని ప్రతి



గ్రామంలోనూ మత్స్య సొసైటీలకు ఈ చేప పిల్లలను పంపీయడం జరుగుతుందని విడతల వారీగా అన్ని చెరువులకు చేప పిల్లలను పంపిణీ జరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేసినారు ఈ కార్యక్రమంలో వార వెంకటేశ్వర్లు, రామనబోయిన వెంకటేశ్వర్లు, తగడబోయిన కృష్ణ, కీసర శ్రీను, భాష బోయిన వీరన్న, పులకాని వెంకటేశ్వర్లు, కుంట వెంకటేశ్వర్లు, చింతల యాదగిరి, వివిధ గ్రామాల నుండి వచ్చిన మత్స్య సొసైటీ అధ్యక్షులు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య విద్యార్థికి అండగా చల్లగుళ్ల నిఖిల్.

**ప్రభుత్వ తరపున వైద్య విద్యార్థి శివ భార్గవి కి అండగా ఉంటా..ఎంఎల్ఏ మట్టా.**



**సత్తుపల్లి అక్టోబర్17 ప్రజా జ్యోతి :** పట్టణంలోని గుడిపాడు కు చెందిన, గిరిజన కుటుంబమైన రాజిని ప్రసాదు నాగమణి దంపతుల కుమార్తె శివ భార్గవి ఇటీవల నీట్ లో సీటు సంపాదించింది. నిరుపేదలకు కావడంతో ఎంబిబిఎస్ చదవడానికి ఖర్చులకోసం ఇబ్బంది పడుతుండటంతో విషయం తెలుసుకున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు చల్లగుళ్ళ నరసింహారావు వారి కుమారుడి నిఖిల్ ఆమెకు 20వేల ఆర్థిక సహాయాన్ని సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ చేతుల మీదుగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆమె ఎంబిబిఎస్ పూర్తి అయ్యేంతవరకు ప్రభుత్వం తరపున ఎలాంటి సహాయ, సహకారాలు, అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వైద్య విద్యను అభ్యసించి పలువురికి ఆదర్శంగా నిలవాలని, తల్లిదండ్రులకు సమాజానికి, మంచి పేరు తీసుకురావాలని, నిరుపేద కుటుంబంలో డాక్టర్ కావటం అంటే వారి అదృష్టమని, ఎప్పుడైనా సహాయ సహకారాలకు సిద్ధంగా ఉన్నామని, కచ్చితంగా అండగా ఉంటామని ఆమెకి ధైర్యాన్ని ఇచ్చారు. ఆమె వెంట గాదె చెన్నారావు, గొర్లమారి రామ్మోహన్ రెడ్డి, కొప్పుల నరేందర్ రెడ్డి, పువాళ్ళ ఉమ, టోపీ శ్రీను కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## ఐదేళ్ల చిన్నారికి హార్ట్ ఎటాక్

**కరీంనగర్ :** మనిషి ఆయుష్షు గుండెపోట్లతో బేజారవుతోంది. వయసుతో సంబంధం లేకుండా క్షణాల్లో ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. అప్పటి వరకు కళ్లెదుటే ఆడుకున్న పాపాయి అకస్మాత్తుగా విగతజీవిగా మారింది. కరీంనగర్ జిల్లాలో ఈ విషాదకర ఘటన జరిగింది. ఆడుతూ.. పాడుతూ గడపాల్సిన వయసు.. కష్టం, సుఖం అంటే ఏంటో కూడా తెలియని పసితనం. కానీ ఆ పసిప్రాణం గుండె జబ్బుతో బలైంది. అప్పటిదాకా ఆడుతూ పాడుతూ.. ఉల్లాసంగా కనిపించిన చిన్నారి ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఇక సెలవంటూ వెళ్లిపోయింది. కరీంనగర్ జిల్లాలో మృతి చెందిన ఐదేళ్ల చిన్నారి గుండె జబ్బుతో చనిపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. చిరునవ్వులు చిందిస్తూ ఆడుతున్న ఈ చిన్నారి పేరు ఉక్కులు. వయసు కేవలం 5 సంవత్సరాలే. జమ్మికుంటకు చెందిన రాజు-జమున దంపతుల ముద్దుల కూతురు. ముద్దు ముద్దు మాటలు మాట్లడే తనంటే.. కుటుంబ సభ్యులకు ఎంతో ఇష్టం. ఇరుగుపొరుగువారు కూడా పాపను బాగా ముద్దు చేస్తారు. మంగళవారం ఉదయం నిద్రలేచి పాప.. కాసేపు ఆడుకుంది. ఆ తర్వాత అమ్మ వద్దకు వచ్చి తనకు కళ్లు తిరుగుతున్నాయని చెప్పింది. దీంతో పాపను తల్లి స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లింది. అక్కడ బాలికను పరీక్షించిన డాక్టర్లు.. పరిస్థితి ఆందోళనకరంగా ఉందని హన్మకొండ పెద్ద ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో వెంటనే పాపను హన్మకొండకు తీసుకెళ్లారు. అక్కడ డాక్టర్లు పరీక్షిస్తుండగానే బాలిక మృతి చెందింది. కాగా, పాపకు గుండె సంబంధిత సమస్యలు ఉన్నాయని.. ఆ విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించలేకపోయారని డాక్టర్లు తెలిపారు. అందువల్లే గుండెపోటు వచ్చి ఉంటుందని అనుమానం వ్యక్తపరిచారు. ఎంతో ప్రేమగా పెంచుకున్నబిడ్డ మరణవార్త వినగానే ఆ తల్లిదండ్రుల ఆవేదన అంతా ఇంతా కాదు. గుండెపోటుతో చిన్నారి మృతిచెందిందని తెలియడంతో గ్రామంలో కూడా విషాదఛాయలు అలుముకున్నాయి. అప్పటివరకూ కళ్లెదుటే ఆడుకున్న పాపాయి అకస్మాత్తుగా విగతజీవిగా మారిపోవడంతో.. కుటుంబసభ్యులు గుండె పగిలేలా రోదిస్తున్నారు.

## కొనసాగుతున్న ఐటీ దాడులు

**హైదరాబాద్ :** తెలంగాణపై ఐటీ అధికారులు దృష్టి సారించారు. అన్విత బిల్డర్స్, గూగి ప్రాపర్టీస్ అండ్ డెవలపర్స్ సంస్థల్లో సోదాలు గురువారం ఉదయం నుంచి సోదాలు చేస్తున్నారు. ఏక కాలంలో 30 చోట్ల ఐటీ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. అన్విత బిల్డర్స్ అధినేత అచ్యుత్‌రావు, బొప్పరాజు శ్రీనివాస్, బొప్పన అనూప్ ఇళ్లు, పార్టనర్లు, బంధువు లు ఇళ్లలో సోదాలు ముమ్మరం చేశారు. హైదరాబాద్, భువనగిరి, కొల్లూరు, రాయ దుర్గం, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట సహా తెలంగాణలోని 30 చోట్ల ఐటీ అధికారులు సోదాలు చేస్తున్నారు. ఐటీ చెల్లింపుల్లో ఆ కంపెనీ చేసిన అక్రమాలను గుర్తించారట అధికారులు. ఈ క్రమంలో సోదాలు జరుపుతున్నట్లు అధికారుల వెర్షన్.

# పత్తి రైతులు దిగాలు

-మొదటిపేజీ తరువాయి

ఆశించిన మేర వర్షపాతం నమోదు కాలేదు. అయినప్పటికీ రైతులు తడిపొడి దుక్కిలోనే పత్తి విత్తనాలు నాటారు. అనేక చీడపీడల బెడద నుంచి పంటను కాపాడుకున్నప్పటికీ ఇటీవల కురిసిన భారీ వర్షాలు పత్తి పంటపై తీవ్ర ప్రభావం చూపాయి.

జిల్లాలో అనేకచోట్ల పైర్లు నేలకొరిగాయి. కొన్ని మండలాల్లో ఊటలు పుట్టి పంట దెబ్బతిన్నాయి. వర్షాల అనంతరం సస్యరక్షణ చర్యలు చేపట్టినప్పటికీ ఆశించిన మేర పంట ఏపుగా పెరగకపోవడంతో ఆ ప్రభావం దిగుబడిపై స్పష్టంగా కనిపిస్తున్నది. ఏటా వానకాలంలో మూడు, నాలుగుసార్లు పత్తి తీతలు తీస్తే ఎకరానికి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉండేది. అయితే ఈ సంవత్సరం రెండుతీతలకు మించి పంట రాదని, ఎకరానికి అతికష్టంపై ఐదు క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. పెట్టుబడి కూడా తీరడం కష్టంగానే ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కొరవడిన సర్కార్ సహాయం..

గత పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సీజన్ ప్రారంభమయ్యిందంటే చాలు సర్కార్ సాయం కార్యక్రమాలు ఎంతో చురుగ్గా జరిగేవి. సీజన్‌కు ముందుగానే సాగు ప్రణాళిక సిద్ధం చేయడంతోపాటు అందుకనుగుణంగా విత్తనాలు, ఎరువులను సొసైటీలకు తరలించడం జరిగేది. ఏ ఒక్క రైతుకు విత్తన, ఎరువుల కొరత లేకుండా పదేండ్లపాటు విజయవంతంగా అమలు జరిగింది. పంటల పెట్టుబడి(రైతుబంధు) నిధులు సైతం తీరా సాగుకు శ్రీకారం చుట్టే సమయంలోనే 2018 నుంచి విధిగా నేరుగా రైతుల అకౌంట్లో జమకావడం, పంట చేతికొచ్చే సమయంలోగానే కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యేవి.

కానీ.. కాంగ్రెస్ సర్కార్‌లో అటువంటి పరిస్థితి కనిపించడం లేదు. పంటల పెట్టుబడికి ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ నాయకులు ఇంతవరకు అతీగతీ లేదు. తీరా పంట మార్కెట్‌కు సైతం వస్తున్నప్పటికీ ఆ ఊసే లేకుండా పోయింది. రైతు రుణమాఫీ తీరు సైతం అనేక విమర్శలకు తావిస్తున్నది. రూ.2 లక్షలలోపు రైతులకు సైతం పూర్తిస్థాయిలో అమలుకాలేదు. దీంతో సర్కార్ నుంచి ఏమాత్రం సాయం లేకపోవడంతో రైతులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



### కానరాని సీసీఐ కేంద్రాలు..

ఈ ఏడాది జిల్లాలోని ఆయా మార్కెట్ల పరిధిలో ఉన్న తొమ్మిది జిన్నింగ్ మిల్లులను సీసీఐ కేంద్రాలుగా గుర్తించారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ క్రయవిక్రయాలకు మాత్రం నోచుకోవడం లేదు. పదిహేనురోజుల నుంచి ఖమ్మం మార్కెట్‌కు రోజుకు 5 వేల పత్తి బస్తాలను రైతులు తీసుకొస్తున్నారు. మార్కెట్‌లో గరిష్ఠ ధర క్వింటాల్ రూ.7 వేలు పలుకుతున్నప్పటికీ ఆ ధర ఒకరిద్దరు రైతులకే పరిమితమవుతున్నది. మిగిలిన రైతులకు క్వింటాల్ రూ.6 వేల నుంచి రూ.6,500 వరకు మాత్రమే పలుకుతున్నది. భారత పత్తి సంస్థ(సీసీఐ) కొనుగోళ్లు చేపట్టకపోవడం కాదు కదా కనీసం కేంద్రాల ఊసేలేకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు తమకు నచ్చిన రీతిలో ధర పెడుతుంటే ఇష్టం లేకున్నా రైతులు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరో పక్షంరోజుల వరకు సీసీఐ కేంద్రాలు ఏర్పాటయ్యే అవకాశం లేదని జిన్నింగ్ మిల్లుల యజమానులు చెబుతున్నారు. దీంతో ఈ ఏడాది రైతుల పేరుతో వ్యాపారులు సీసీఐ కేంద్రాలకు పంటను తరలించే అవకాశం వందకు వందశాతం ఉందనే చర్చ కొనసాగుతున్నది. తేమ శాతం లేదని కాలయాపన చేస్తున్న సీసీఐ అధికారులు చివరికి వ్యాపారుల వద్దనే కొంటారని వారు బహిరంగంగానే చర్చించుకోవడం విశేషం. ఏదేమైనా సకాలంలో సీసీఐ కేంద్రాలు ప్రారంభమైతే తప్ప పత్తి రైతులు మద్దతు ధర పొందడం అసాధ్యం.

## బండ్లగూడలో దారుణం

**హైదరాబాద్ :** తన కూతురిని ప్రేమ పేరుతో లేపుకెళ్లిపోతున్నాడని అడ్డుకున్నందుకు ఓ తల్లిని ప్రేమికుడి ఫ్రెండ్స్ అత్యంత దారుణంగా చితకబాదారు. హైదరాబాద్ నగరం బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసముంటున్న సానియా బేగం భర్త చనిపోయాడు. ఆమెకి నలుగురు కూతుళ్లు కాగా, అందులో ఇద్దరికి వివాహాలు అయిపోయి అత్తవారింట్లో ఉంటున్నారు. ఇక మిగతా ఇద్దరు కూతుళ్లకి పెళ్లి కావాల్సి ఉంది. ఆ ఇద్దరు కూతుళ్లు ఈవెంట్లో జాబ్ చేసుకుంటూ తల్లితో పాటు కలిసి జీవిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉండగా, వాళ్ల ఇంటి సమీపంలో ఉండే హామీర్ అనే వ్యక్తి ఆ ఇద్దరిలో ఒక కూతురిని ప్రేమ పేరుతో ఇబ్బందులు పెడుతూ ఉండేవాడు. ఒకరోజు ఆ అమ్మాయిని కిడ్నాప్ చేసి తీసుకెళ్లిపోతుండగా గమనించిన తల్లి ఆపే ప్రయత్నం చేసింది.గట్టిగా కేకలు పెడుతూ ఇరుగుపొరుగు వారిని సాయం కోసం పిలిచింది. తన కూతురిని ఆ వ్యక్తి అలా తీసుకెళ్లిపోతుండడం చూసి తట్టుకోలేని ఆ తల్లి ఎలాగైనా అతనిని ఆపాలని ఎన్నో ప్రయత్నాలు చేసింది. ఈ క్రమంలో ఆ ప్రేమికుడితో పాటు అతని ఫ్రెండ్స్, బంధువులు తల్లి సానియాపై అత్యంత దారుణంగా దాడి చేసి పారిపోయారు. అయితే.. ఆ అబ్బాయే తన కూతురికి మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడా? లేదా ఆ కూతురే తనంతట తానుగా ఇష్టంతో వెళ్లిందా? అనేది తెలియాల్సి ఉంది. తన కూతురిని ప్రేమ పేరుతో వేధించి హింసించి తీసుకెళ్లిపోతుంటే ఆపే ప్రయత్నం చేసినందుకు ప్రేమికుడు, అతని ఫ్రెండ్స్ తనపై దాడి చేసినట్టు తల్లి సానియా పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా, మహిళపై దాడికి పాల్పడిన ముగ్గురు నిందితులపై బండ్లగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారుపోలీసుల విచారణలో కొన్ని ఊహించని విషయాలు బయటికి వచ్చాయి. ఆ అమ్మాయి, అబ్బాయి ఇద్దరూ తరచుగా మాట్లాడుకోవడంతోనే ఈ గొడవకి కారణం అయిందని తేలింది. అమ్మాయి, అబ్బాయి తరచుగా మాట్లాడుకుంటుంటే తన కూతురు చెప్పిన విషయాన్ని విని తల్లి ఆ అబ్బాయి కుటుంబంతో గొడవ పడింది. ఈ క్రమంలో మాటామాటా పెరిగి ఇరు కుటుంబాలు కొట్టుకున్నట్టు పోలీసులు చెబుతున్నారు

## సీఎం కప్ టార్చ్ ర్యాలీ ప్రారంభించిన ఎమ్మెల్యే ఐలయ్య

**యాదాద్రి :** యువత చెడు వ్యసనాలకు, మత్తుపదార్థాలకు బానిస కావొద్దని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పిలుపునిచ్చారు.. యాదాద్రి-భువనగిరి జిల్లాలోని భువనగిరి కలెక్టర్ కార్యాలయ ప్రాంగణానికి చేరుకొని "సీఎం కప్ టార్చ్ ర్యాలీ" ని ఆయన ప్రారంభించారు. ఈ ర్యాలీ కలెక్టర్ కార్యాలయం నుంచి భువనగిరి కోట వరకు నిర్వహించారు. ముందుగా కలెక్టర్ కార్యాలయం వద్ద కాగడ వెలిగించి జెండా ఊపి ఈ ర్యాలీ ని ప్రారంభించారు. పల్లెల నుంచి ప్రతిభ ఉన్న క్రీడాకారులను వెలికితీయడానికి సీఎం కప్ చక్కటి వేదిక అని అయన అన్నారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో ఉండే క్రీడాకారుల ప్రతిభను గుర్తించి వారిని రాష్ట్ర, జాతీయ, ప్రపంచ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దే ప్రయత్నమే సీఎం కప్ ఉద్దేశ్యమన్నారు.

## మూఢ నమ్మకాలతో ఊరంతా ఖాళీ

**నల్గొండ :** నల్గొండ జిల్లా వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామం... ఇటీవల గ్రామంలో వరస మరణాలు సంభవించాయి. అనారోగ్యంతో కొంతమంది.. రోడ్డు ప్రమాదంలో మరికొందరు.. వయసు మళ్ళిన వారు మృత్యువాత పడ్డారు. గ్రామానికి కీడు దాపరించడంతోనే ఇలాంటి అనర్థాలు జరుగుతున్నాయని భావించిన ప్రజలు భయాందోళనకు గురయ్యారు. కీడు పోవాలంటే సూర్యోదయాన్ని కంటే ముందే పిల్ల పెద్దలతో సహా ఒకరోజు ఊరు ఊరంతా ఖాళీ చేసి సూర్య అస్తమయం వరకు ఊరు బ యట ఉండాలని గ్రామ పెద్దలు నిర్ణయించారు. దీంతో గ్రామ ప్రజలంతా పొద్దు పొడవక ముందే ఇండ్లు విడిచి ఊరి పొలిమేరు దాటరు. అక్కడే వంట వార్పు చేసుకున్నారు. ఈ ఘటనతో ఊరంతా నిర్మానుష్యంగా మారింది. గత పది నెలల కాలంలో చిన్న పెద్ద బేధం లేకుండా 70 మంది వరకు గ్రామస్తులు మృత్యువాత వడ్డారని. దీనికి గ్రామానికి సోకిన కీడే కారణంగా భావిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు.